క్లుప్తంగా

ఎమ్మెల్సీ తోట నూతన సంవత్సర శుభాకాంక్షలు

మండపేట: మండపేట నియోజకవర్గ ప్రజలకు, వైఎస్సార్ సీపీ నాయకులకు ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, అధికారులకు, అనధికారులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.నూతన సంవత్సరంలో పార్టీ కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగాలన్నారు. నూతన సంవత్సర వేడుకలను ఈ ఏడాది పట్టణంలోని విజయలక్ష్మి నగర్లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వేడుకలు జరుపుతున్నట్టు తెలిపారు. జనవరి 1న రోజంతా తాను అందుబాటులో వుంటానన్నారు.

దేవతామూర్తులకు పంచామృతాభిషేకం


కపిలేశ్వరపురం జనార్దనస్వామి ఆలయంలో భక్తులు

కపిలేశ్వరపురం: స్థానిక శ్రీదేవీ భూదేవీ సమేత జనార్దన స్వామి తదితర దేవతామూర్తులకు ఆలయ అర్చకుడు పెద్దింటి వెంకటలక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో సోమవారం పంచామృతాభిషేకం పూజలు చేశారు. దేవదాయ,ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలో నిర్వహించిన పూజలో గ్రామానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా రమణ మహర్షి జయంతి


ఆర్యావటంలో రమణ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేస్తున్న స్థానికులు

కాజులూరు: రమణ మహర్షి జయంతి కార్యక్రమాలను సోమవారం ఆర్యావటంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రామాలయంలో అమలాపురం పార్లమెంట్ శెట్టిబలిజ సంఘం కన్వీనర్ కడలి రాంపండు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొడ్డు విష్ణుమూర్తి తదితరులు పాల్గొని రమణమహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతర రమణమహర్షి చిత్రపటాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించి ఆయన జన్మవృత్తాంతాన్ని ప్రజలకు వివరించారు. పలువురు స్థానికులు పాల్గొన్నారు.

19 నుంచి రాయవరం పోలమ్మ జాతర

రాయవరం: రాయవరం గ్రామదేవత పోలమ్మ జాతర జనవరి 19 నుంచి 21 వరకూ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని పోలమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, ఎంపీపీ నౌడు వెంకటరమణ సోమవారం విలేకరులకు తెలిపారు. జనవరి 19న ముత్యాలమ్మ వారి జాతరతో పోలమ్మ వారి ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 21న పోలమ్మ వారి ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాలకు ఉభయ గోదావరి జిల్లాలతో పాటుగా, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి భక్తులు హాజరు కానున్నట్టు ఎంపీపీ తెలిపారు.

క్షేత్ర పరిశీలనతో అవగాహన పెరుగుతుంది

కపిలేశ్వరపురం: విద్యార్థులు క్షేత్రస్థాయిలో పర్యటించడం ద్వారా సామాజిక, జీవనపరమైన అంశాలపై అవగాహన మెరుగవుతుందని మాచర జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమాదేవి అన్నారు. పీఎంసీ పాఠశాలగా ఎన్నికైన నేపథ్యంలో పాఠశాల విద్యార్థులు అంగర విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. సబ్ స్టేషన్ సిబ్బంది విద్యుత్ ఉత్పత్తి, నిల్వ, సరఫరా, సాంకేతిక సమస్యల పరిష్కారం, నివాసంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజశేఖర్, శివ శ్రీను, వృత్తివిద్యా శిక్షకుడు శ్రీనుబాబు పాల్గొన్నారు.

కొబ్బరిచెట్ల ఫలసాయం వేలం ఖరారు

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీ ఆవరణ 1.4 ఎకరాల ఖాళీ స్థలం, 30 కొబ్బరి చెట్లు సాగు చేసుకుని ఫలసాయం పొందేందుకు సోమవారం ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన వేలం ఖరారైంది. వైద్యాధికారి పి.రత్న కుమారి, ఈఓపీఆర్‌డీ ఈశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన వేలంలో చిలుకూరి శ్రీనివాస్ అత్యధికంగా రూ.2,11,500 పాడుకున్నారు. మూడేళ్ల పాటు ఫలసాయం పొందే హక్కుతో వేలం పాటను ఖరారు చేసినట్టు వైద్యాధికారి రత్నకుమారి తెలిపారు. కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక పంచాయతీల సర్పంచులు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, పీహెచ్‌సీ ఎంపీహెచ్ఎస్ జిత్తుక మల్లికార్జునుడు పాల్గొన్నారు.

హృదయం ద్రవించిన వేళ..

- ప్రశాంత ప్రాంతంలో విషాద ఘటనలు
- రెండు నియోజకవర్గాల్లో అలజడి
- 2024 నేర, ఘోర ఘటనల సమాహారంపై కథనం



కపిలేశ్వరపురం: మానవ జీవితం ఎంతో మధురమైనది. ఆ జీవన తరంగంలో తీవ్రమైన మలుపులెన్నో చోటు చేసుకుంటుంటాయి. జీవితం పూలపాన్పు కాదని, కష్టనష్టాల కలబోత అని జీవన క్రమంలో తెలియకనే తెలుస్తుంది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల ప్రజలు ప్రశాంత జీవనాన్ని గడుపుతారు. అయినా 2024 సంవత్సరం ఈ రెండు నియోజకవర్గాల్లో అనేక అలజడులు, విషాదాలను మిగిల్చింది. చోరీలు, కొట్లాటలు, హత్యలు, ఆత్మహత్యలు, నేర శిబిరాలపై పోలీసుల దాడులు, విచారణ అనంతరం కోర్టు తీర్పులు.. ఇలా నేర సంబంధిత అంశాలెన్నో 2024ను పలకరించాయి. రెండు నియోజకవర్గాల్లో ప్రజలను కలవరపెట్టిన ఆ నేరాలు, ఘోరాల సమాహారమే ఈ 2024 ఇయర్ రౌండప్.


అక్టోబర్ 28న ఏడిదలో బాణసంచా పేలిన ఘటనా స్థలం (ఫైల్)


జూలై 5న కాపవరంలో దమ్ము ట్రాక్టర్‌లో చిక్కుకుని మృతి చెందిన సిద్ధాల తరుణ్‌కుమార్ (ఫైల్)

జనవరి

- 2 అవినీతిలో చిక్కుకున్న అధికారులే లక్ష్యంగా బెదిరించి డబ్బులు వసూలు చేసిన యువకుడిని మండపేట రూరల్ పోలీసులు పట్టుకున్నారు.
- 6 టేకి ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెంకే వెంకట్రావు అనారోగ్యంతో మృతి
- 08 కాలేరు-నల్లూరు రహదారిపై రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు.

ఫిబ్రవరి

- 15 మోటారు సైకిళ్ల దొంగతనం కేసులో నిందితులను, 17 వాహనాలను పట్టుకున్న రామచంద్రపురం పోలీసులు
- 15 తాపేశ్వరం రోడ్డుపై లారీ, మోటారు బైక్ ఢీకొన్న ఘటనలో అంగరకు చెందిన ఇంటర్ విద్యార్థి పడాల మధుసాయి మణికంఠ (17) మృతి

మార్చి

- 2 రాయవరం మండలం సోమేశ్వరంలో ఆటో, కారు ఢీకొన్న ఘటనలో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు.
- 6 తాపేశ్వరం రైసు మిల్లులో రూ.26,787 విలువైన పీడీఎస్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు.
- 11 చెల్లూరు శివారు యర్రమట్టిపురంలో అక్రమంగా నిల్వ ఉంచిన 25 బస్తాల బియ్యాన్ని పట్టుకున్నారు.

ఏప్రిల్

15 ద్రాక్షారామకు చెందిన మునసబు నున్న బాబ్జి (78) వృద్ధాప్యంతో మృతి
19 ద్రాక్షారామకు చెందిన దంత వైద్యుడు ఇళ్ల వెంకటేశ్వర్లు (72) గుండెపోటుతో మృతి చెందారు.

మే

- 3 వానపల్లికి చెందిన యెనుముల నాగసతీష్ (23), కంఠంశెట్టి ప్రసన్నకుమార్ (25)లు నారాయణలంక వద్ద గోదావరి నదిలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందారు.
- 28 మసకపల్లి గోదావరి గట్టుపై రూ.13,500 విలువైన మద్యం బాటిళ్లను గంగవరం పోలీసులు పట్టుకున్నారు.
- 22 చెల్లూరులో రెండు మట్టి ట్రాక్టర్లను అధికారులు సీజ్ చేశారు.

జూన్

- 15 మండపేటకు చెందిన న్యాయవాది, ఆలమూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కేఆర్‌సీ నారాయణరెడ్డి (64) అనారోగ్యంతో మృతి చెందారు.

జూలై

- 5 కాపవరంలో దమ్ము ట్రాక్టర్‌లో చిక్కుకుని సిద్ధాల తరుణ్‌కుమార్ (24) అనే యువకుడి మృతి
- 15 అంగరలో మతిస్థిమితం లేని నున్న నరేష్ (38)ని కొందరు వ్యక్తులు కొట్టి చంపారు.

ఆగస్టు

- 1 లొల్ల మాజీ సర్పంచ్ లంక సుబ్బాయమ్మ (56) గుండెపోటుతో మృతి చెందారు.
- 9 ఉప్పుమిల్లి శివార్లలో ఆర్టీసీ బస్, బైక్ ఢీకొన్న ఘటనలో మేకల నాగయ్య (18) మృతి చెందాడు.
- 16 కోటిపల్లి రేవులో స్నానానికి దిగిన కందుల నరేంద్ర (25) అనే యువకుడు మృతి చెందాడు.

సెప్టెంబర్

- 19 రామచంద్రపురం మాజీ కౌన్సిలర్ గంపల మల్లికార్జునరావు అనారోగ్యంతో మృతి చెందారు.
- 25 కపిలేశ్వరపురం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ శీలం గోవిందు అనారోగ్యంతో మృతి చెందారు.

అక్టోబర్

- 1 రామచంద్రపురం కౌన్సిలర్ కట్టా శ్రీరాములు (76) అనారోగ్యంతో మృతి చెందారు.
- 3 పసలపూడిలో రూ.5,46,410 విలువైన అక్రమ రేషన్ బియ్యం నిల్వలను పట్టుకున్నారు.
- 3 కపిలేశ్వరపురం మండల టైలర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక నాయకులు పలసపూడి సుబ్బారావు (88) మృతి చెందారు.
- 13 కోటిపల్లి గోదావరి నదిలో దేవీ విగ్రహ నిమజ్జనంలో నరాల వేదమూర్తి మేడిశెట్టి వీరబ్రహ్మం మృతి చెందారు.
- 13 ఉప్పుమిల్లి వద్ద పిడుగు పడటంతో కరపకు చెందిన నందికొండ వీరాస్వామి (35)మృతి చెందాడు.
- 25. మాచవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పడాల శ్రీనివాసరెడ్డి (57) గుండెపోటుతో మరణించగా కుటుంబ సభ్యులు నేత్రదానం చేశారు.
- 28 మండపేట మండలం ఏడిదలో బాణసంచా పేలడంతో కృష్ణ మృతిచెందాడు.

నవంబర్

- 16: మాచవరం ఎంపీటీసీ సభ్యురాలు పలివెల శోభన భర్త పలివెల సతీష్ (37) గుండెపోటుతో మృతి చెందారు.

డిసెంబర్

- 1 యానాం- ద్వారపూడి రోడ్డులో కాజులూరు మండలం కుయ్యేరు- ఉప్పులూరు సరిహద్దులో అక్రమంగా కలప రవాణా చేస్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

పాకలు తొలగించమని నోటీసులు ఇచ్చారు

- అధికారులతో మాట్లాడి ఆదుకోండి
- ఎమ్మెల్సీ తోటకు ఏడిద మహిళల మొర


ఎమ్మెల్సీ తోటకు ఇళ్ల సమస్యను వివరిస్తున్న ఏడిద మహిళలు

మండపేట: మండలంలోని ఏడిద హైస్కూల్ సమీప చెరువు గట్టుపై తలదాచుకుంటున్న తమ పాకలను విడిచి పెట్టి వెళ్లిపోవాలంటూ పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారని నివాసిత మహిళలు వాపోయారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఈ పాకల్లోనే తాము కుటుంబాలతో నివాసం ఉంటున్నామని వారు పేర్కొన్నారు. ఈ మేరకు మహిళలు సోమవారం వారు మండపేట విజయలక్ష్మి నగర్లోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు ఫిర్యాదు చేశారు. తాము అక్కడే నివాసం ఉండేలా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని మహిళలు విజ్ఞప్తి చేశారు. ఇదే సమస్యపై తాము ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును అర్థించగా, కలెక్టర్ వద్దకు వెళితే న్యాయం జరుగుతుందని వేగుళ్ల సలహా ఇచ్చారని వివరించారు. దీనిపై ఎమ్మెల్సీ తోట స్పందిస్తూ అధికార పార్టీ ఎమ్మెల్యే వల్ల సమస్య పరిష్కారం కాకపోతే ఇంకెవరి ద్వారా న్యాయం జరుగుతుందంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ సమస్యపై తన ప్రయత్న లోపం లేకుండా కలెక్టరు దృష్టిలో పెట్టి న్యాయం చేయమని కోరతానని మహిళలకు హామీ ఇచ్చారు. సీతానగరం సర్పంచ్ వరదా చక్రవర్తి, నాయకులు ముక్కపాటి కోటేశ్వరరావు, పిల్లా వీరబాబు, పిల్లి శ్రీనివాస్, ముమ్మిడివరపు బాపిరాజు తదితరులు వున్నారు.

అలీఖాన్ బాబా మాతృమూర్తి మృతికి సంతాపం

షేక్ అండ్ షేక్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్ బాబా మాతృమూర్తి షేక్ మీరాబీ (82) సోమవారం మృతి చెందారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి తమ సంతాపాన్ని ప్రకటించారు. అలాగే కౌన్సిల్ విప్ పోతంశెట్టి వరప్రసాద్, వైఎస్సార్ కౌన్సిలర్లు మారిశెట్టి సత్యనారాయణ, పిల్లి శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ రబ్బానీ, ఆ పార్టీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, నాయకులు మొండి మురళీ, పెద్దమ్మ తల్లి ఆలయ వ్యవస్థాపక చైర్మన్ వాలిన వీరబాబులు తమ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మద్యం వ్యాపారంలో వాటా ఉందని నిరూపించగలరా?

- దేవుని ఎదుట ప్రమాణం చేద్దాం రండి
- ఎమ్మెల్యే వేగుళ్లకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సవాల్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: నాటి నుంచి నేటి వరకూ తనకు మద్యం వ్యాపారాల్లో వాటాలు లేవని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పష్టం చేశారు. దీనిపై దేవుని ఎదుట ప్రమాణం చేయడానికి కూడా తాను సిద్ధమే అని ఆయనన్నారు. మద్యం వ్యాపారాల్లో తనకు వాటాలు ఉన్నాయంటూ ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కూడా ప్రమాణం చేయడానికి సిద్ధమేనా? అని ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తోట త్రిమూర్తులు సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రెండ్రోజుల క్రితం వేగుళ్ల ప్రెస్‌మీట్ పెట్టి తనపై చేసిన ఆరోపణలను ఖండించారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల బాదుడుపై ఈ నెల 27న వైఎస్సార్ సీపీ తరపున మండపేటలో ఆందోళనబాట పట్టి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించామన్నారు. దానికి వేగుళ్ల సమాధానం చెప్పకుండా జగన్ పైనా, తనపైనా వ్యక్తిగతంగా విమర్శలు చేయడం దేనికని ప్రశ్నించారు.

మద్యం షాపుల నుంచి వాటాల మాటేమిటి?

కూటమి ప్రభుత్వ మద్యం పాలసీకి వ్యతిరేకంగా నియోజకవర్గంలో అనధికార టాక్స్‌లు వసూలు చేసేదెవరని? తోటత్రిమూర్తులు ప్రశ్నించారు. నియోజకవర్గంలోని 22 షాపుల నుంచి రూ.10 లక్షలు వాటాగా తీసుకుంటున్నది మీరు కాదా? అని వేగుళ్లను ప్రశ్నించారు. ఒక్కో షాపునకు 25 శాతం కమిషన్లు వసూలు చేసేది ఎవరో అందరికీ తెలుసన్నారు. మద్యం బెల్టు షాపులను ప్రోత్సహిస్తే బెండు తీస్తానని చంద్రబాబు వార్నింగ్ ఇచ్చినప్పటికీ ఊరూరా 3 , 4 బెల్టు షాపులు పెట్టించి ప్రోత్సహించేది ఎవరని ప్రశ్నించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన మరునాడే రాబందుల్లా కపిలేశ్వరపురం, తాతపూడి ఇసుక ర్యాంపుల్లో పడి ఇసుక ఎత్తుకెళ్లి పోయిందని ఎవరని నిలదీశారు. ఉచిత ఇసుక విధానమంటూ ప్రజలను మభ్య పెట్టి జియో ట్యాగింగ్ ఉన్న చోట కాకుండా పక్కన తవ్వకాలు జరిపి ఇసుకను కొల్లగొడుతోంది మీరు కాదా? అని వేగుళ్లను ప్రశ్నించారు. మీ తరపున ర్యాంపులో ఒక్కో లారీకి రూ.7 వేల నుంచి రూ.8 వేలు వసూలు చేయడం నిజం కాదా? అని నిలదీశారు. తాను ఏ పార్టీలో ఉంటే మీకొచ్చిన నొప్పేంటని తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. ప్రజల ఏ పార్టీ కోరుకుంటారో ఆ పార్టీలో వుంటానని గతంలోనే తాను స్పష్టం చేశానని గుర్తు చేశారు. గతంలో మీరు కాంగ్రెస్ పార్టీలో వుండి ఇప్పుడు టీడీపీలో పని చేయడం లేదా అని గుర్తు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ కార్యాలయం పక్కన మద్యం షాపు, బెల్టు షాపు పెట్టించారంటే కూటమి నాయకులు ఎంత దౌర్భాగ్య స్థితిలో ఉన్నారో అర్థం అవుతోందన్నారు. తప్పులు మీరు చేస్తూ తనపై ఆరోపణలు చేయడానికి సిగ్గుండాలంటూ ఖండించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ , కౌన్సిలర్లు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రియా పోటీల్లో 'దేవళ్ల'కు ప్రథమ స్థానం



ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని సింధూజ


క్రియ పోటీల్లో బహుమతులు అందుకుంటున్న సోమేశ్వరం విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 29న ఆదివారం కాకినాడ జేఎన్‌టీయూలో జరిగిన 11వ రాష్ట్రస్థాయి క్రియా పోటీల్లో రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్న దేవళ్ల పూర్వ సింధూజ జూనియర్ క్రాఫ్ట్స్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి గెలుచుకుందని పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి సోమవారం విలేకరులకు తెలిపారు. విద్యార్థిని సింధూజ, ఆమెకు గైడ్‌గా పనిచేసిన క్రాఫ్ట్స్ టీచర్ విత్తనాల ధనలక్ష్మిని పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి, సర్పంచ్ చాట్రాతి వీరలక్ష్మి, ఎంపీటీసీ పరమటి జ్ఞానలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాయవరం: క్రియ పండగ పోటీల్లో సోమేశ్వరం ద్వారంపూడి మంగాయమ్మ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్ఎం ఆర్.దయామణి సోమవారం విలేకరులకు తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూలో ఈ నెల 28న నిర్వహించిన పోటీల పాటల సీనియర్స్ విభాగంలో ఈ పాఠశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి, వక్తృత్వ పోటీల్లో కన్సొలేషన్ ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. లోకసత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ, జేఎన్‌టీయూ వీసీ మురళీకృష్ణ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నట్లు ఆమె తెలిపారు.

సైన్స్‌తోనే సమాజాభివృద్ధి సాధ్యం


కపిలేశ్వరపురంలో విద్యార్థుల ఆవిష్కరణను పరిశీలిస్తున్న అధికారులు

కపిలేశ్వరపురం: అధునాతన సైన్స్‌తోనే మానవ సమాజాభివృద్ధి సాధ్యమని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న వక్తలన్నారు. ఎంఈఓ కె.తాతారావు, సైన్స్ ఫేర్ నోడల్ అధికారి అంగర రాజు, హెచ్ఎం వంగా శ్రీనివాస్, సీనియర్ సైన్స్ ఉపాధ్యాయుడు జె.రమేష్‌బాబు తమ ప్రసంగాల్లో సైన్స్ ఆవిష్కరణ ప్రాధాన్యతను వివరించారు. టేకి హైస్కూల్ విద్యార్థిని ఆర్.అమృత సుస్మిత రూపొందించిన సోలార్ పవర్ ఇరిగేషన్ ప్రథమ స్థానంలో నిలిచింది. గ్రూపు విభాగంలో కాలేరు హైస్కూల్ విద్యార్థులు రూపొందించిన వయస్సు కొలమాన పరికరం మొదటి స్థానంలో నిలిచింది. ప్రైవేట్ పాఠశాల వ్యక్తిగత ఆవిష్కరణ విభాగంలో అంగర రామకృష్ణ పబ్లిక్ స్కూల్ విద్యార్థి కె.మనోహర్ సోలార్ క్లిప్స్ మొదటి స్థానాన్ని దక్కించుకుంది. విద్యార్థులను నిర్వాహక అధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

దాతల ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి


విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించిన ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు

కాజులూరు: దాతల ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసిస్తూ విద్యలో ప్రతిభ కనపరుస్తున్న పలువురు పేద విద్యార్థులకు హైదరాబాదుకు చెందిన జామి రామకృష్ణ ఉపకారవేతనాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా కాజులూరు ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన కె.దేవీసుహాని, జక్కే దివ్య, ఎం.రామభవాని, వై.సత్యేశ్వర్, టి.భవాని, యు.అక్షయ, జి.సత్యనాగశ్రీ, వి.అలేఖ్య, ఎల్.లక్ష్మిలకు రామకృష్ణ రూ.14 వేల చొప్పున ఆర్థిక సహకారాలు అందించగా సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్ విద్యార్థులకు అందజేశారు. తన మిత్రుడి ద్వారా పేద విద్యార్థులకు ఆర్థిక సహకారానికి కృషి చేస్తున్న కళాశాల లైబ్రేరియన్ వి.భీమేశ్వరరావుని ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శ్రీనివాస్, అధ్యాపక బృందం అభినందించారు.

భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు దోహదం


జగన్నాథగిరి సదస్సులో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీటీ శ్రీనివాసరావు

కాజులూరు: గ్రామాల్లో సరిహద్దు రైతుల మధ్య తలెత్తిన భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో దోహదపడుతున్నాయి. మండల డీటీ ఎం.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని జగన్నాథగిరిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ సదస్సుల ద్వారా రీ సర్వేలో తలెత్తిన భూ హెచ్చు తగ్గులను సరిచేసుకోవాలన్నారు. మ్యుటేషన్, కుటుంబ సభ్యుల ధ్రువపత్రాలు, రీ సర్వే రీజన్స్, ఇతర సమస్యలపైన రైతులు ఫిర్యాదు చేసినట్లయితే రెవెన్యూ అధికారులు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారన్నారు. జగన్నాథగిరి సదస్సులో వివిధ సమస్యలపై ఎనిమిది దరఖాస్తులు అందినట్టు వీఆర్వో ఈశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొళాని అచ్యుతాంబఅరుణ, ఎంపీటీసీ కొప్పన లక్ష్మి, మండల సర్వేయర్ మూర్తి, నీటిసంఘం అధ్యక్షుడు పేపకాయల బాబ్జి, పలువురు వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపు తనిఖీ చేసిన ఆర్డీఓ


కపిలేశ్వరపురం ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న ఆర్డీఓ అఖిల

కపిలేశ్వరపురం: స్థానిక ఇసుక ర్యాంపును రామచంద్రపురం ఆర్డీఓ అఖిల సోమవారం తనిఖీ చేశారు. ర్యాంపు నిర్వహణ సమయాలను విధిగా పాటించాలని, రాత్రివేళ తవ్వకాలు, యంత్రాలను వినియోగించడం చట్టవిరుద్ధమని నిర్వాహకులను, సంబంధిత అధికారులకు సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ చిన్నారావు, ఆర్ఐ అర్జమ్మ, కార్యదర్శి శివచక్రవర్తి, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనుల నిర్వహణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

కపిలేశ్వరపురం: తాతపూడిలో జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మిస్తున్న పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో లోపాలు, పంచాయతీ పాలకవర్గాన్ని విస్మరించడంపై సోమవారం జిల్లా కలెక్టర్‌కు వైఎస్సార్ సీపీ తాతపూడి శాఖ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ తదితరులు ఫిర్యాదు చేశారు. పంచాయతీ తీర్మానాలు లేకుండా అధికార పార్టీ నేతల కనుసన్నల్లో అధికారులు పనులు చేపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు సత్యనారాయణ తెలిపారు.

ధ్యానం సర్వరోగ నివారిణి


పిరమిడ్ మాస్టర్లను సత్కరిస్తున్న ఫణికృష్ణారెడ్డి, సీతాదేవి దంపతులు

రాయవరం: ధ్యానం సర్వరోగ నివారిణి అని పిరమిడ్ మాస్టర్స్ తాడి సూరయ్యమ్మ, సీహెచ్ సూర్యకుమారి అన్నారు. స్థానిక వెలగల వెంకటరెడ్డి ధ్యాన మందిరంలో సోమవారం ఉచిత ధ్యాన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంకల్ప సిద్ధి, ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి ఎదగడానికి ధ్యానం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా పిరమిడ్ ధ్యాన మందిరం అధినేతలు వెలగల ఫణికృష్ణారెడ్డి, సీతాదేవి దంపతులు పిరమిడ్ మాస్టర్స్ తాడి సూరయ్యమ్మ, సీహెచ్ సూర్యకుమారిలను సత్కరించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా మందిరం నిర్వాహకుడు జి.కాశీ విశ్వనాథం, వైట్ల రాజ్యలక్ష్మి, రాయవరం, తొస్సిపూడి, సోమేశ్వరం, పులుగుర్త, మాచవరం, కొప్పవరం గ్రామాలకు చెందిన పిరమిడ్ ఫాలోవర్స్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్ల పంపిణీ


మోడల్ టెస్ట్ పేపర్లతో టెన్త్ విద్యార్థులు

మండపేట: పట్టణంలోని సత్యశ్రీ రోడ్డులోని ఎస్ఏస్‌వీపీ మున్సిపల్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు సోమవారం మోడల్ టెస్టు పేపర్లు పంపిణీ చేశారు. పట్టణానికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి తన తల్లి దండ్రులు సత్యనారాయణరెడ్డి, సుభద్రమ్మల జ్ఞాపకార్థం ఈమోడల్ టెస్టు పేపర్లు సమకూర్చారు. వాటిని ఎంఈఓ నాయుడు రామచంద్రరావు చేతుల మీదుగా టెన్త్ విద్యార్థులకు అందజేశారు.కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వై.ప్రసాదరావు, బి. నారాయణరావు పాల్గొన్నారు.

అధికారులను కలిసిన బీజేపీ నాయకులు

రాయవరం: బీజేపీ మండల శాఖ నాయకులు శనివారం పలువురు అధికారులను సోమవారం కలిశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు, ఎంపీడీవో కీర్తిస్పందనలను వారు మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని దుశ్శాలువాలతో సత్కరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటాన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలందరికీ కనిపించేలా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు అధికారులను కోరారు.

ఎస్ఎంసీల విధులపై శిక్షణ

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఎంఈఓ కార్యాలయంలో సోమవారం డివిజన్ పరిధిలోని రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం మండలాల పరిధిలోని డీఆర్‌పీలు, ఎస్ఎంసీ చైర్మన్‌లకు కమిటీల విధులపై అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. వీరికి రామచంద్రపురం ఎంఈఓ వి.నాగేశ్వరి, కె.గంగవరం ఎంఈఓ ఎ.నాగరాజు, సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, రిసోర్సుపర్సన్లు విశల్, పుల్లయ్య, సాయన్న,శ్రీలక్ష్మి శిక్షణ అందజేశారు.

అమిత్‌షా వాఖ్యలకు నిరసనగా రాస్తారోకో

రామచంద్రపురం: అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన అనుచిత వాఖ్యలకు నిరసనగా రామచంద్రపురం పట్టణ ప్రధాన రహదారిపై సోమవారం వామపక్షాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేశంలోని అందరు ప్రజలు స్వేచ్ఛ, సమానత్వంతో బతికే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్‌ను హోం శాఖ మంత్రి అవమానించే విధంగా మాట్లాడటం సహించరాని విషయమన్నారు. అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.